

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 194

బుధవారం 4-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

క్లుప్తంగా...

కులవృత్తులకు అండగా బీఆర్ఎస్



లాస్యకు మద్దతు ప్రకటిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: బీసీబంధుతో కులవృత్తుల వారికి అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు లభిస్తోందని బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ అభ్యర్థి లాస్య నందిత పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గం రసూల్‌పురాలో లాస్య నందిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసూల్‌పురాలోని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పలువురు లాస్యకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నివేదిత, టీఎస్ శ్రీనివాస్, కుమార్, నరేష్ శ్యాంరెడ్డి, నర్సింహా, సురేష్, ప్రవీణ్, శ్యాం, క్రిష్ణ, నరేందర్, విఠల్, ఆనంద్, రవి, వినోద్ సత్యనారాయణ రాము, మోహన్ రవీందర్ పాల్గొన్నారు.

పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ.రవికుమార్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ.రవికుమార్ నియమితులయ్యారు. మంగళవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఆయనకు నియామక పత్రాలను అందజేశారు. కామర్స్ విభాగానికి చెందిన ప్రొ.రవికుమార్ గతంలో వివిధ పదవులను చేపట్టారు. చిన్న వయస్సులోనే పీజీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 28 బెండకాయ 23, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 23, గుండుబీన్స్ 70, గింజ చిక్కుడు 65, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.



★ లష్కర్‌లో జోరు పెంచిన బీఆర్ఎస్
★ మూడో విజయం కోసం ఆరాటం
★ ముందస్తు ప్రచారాలు ప్రారంభం
★ ప్రత్యర్థి పార్టీల కట్టడికి స్కెచ్

హ్యాట్రిక్ అమలవుతుందా?



లష్కర్ అభివృద్ధి ధూంధాం సభలకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధం చేస్తున్న వేదిక

సికింద్రాబాద్: త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో మరోమారు అధికారం చేజిక్కించుకునేందుకు లష్కర్ బీఆర్ఎస్ నాయకులు కసరత్తు ప్రారంభించారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం అనుకుంటున్న కాంగ్రెస్, బీజేపీల నుంచి ఇప్పటికీ అభ్యర్థుల ఎంపిక జరుగలేదు. బీఆర్ఎస్ నుంచి మరోమారు తన అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. సెప్టెంబర్ నెలాఖరు వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల వరకే పరిమితమైన ఆయన ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో వ్యూహం మార్చుకున్నారు. పార్టీ కార్యక్రమాలు, ముందస్తు ఎన్నికల ప్రచార సరళిని అమలు చేస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండేందుకు, తాము చేపట్టిన అభివృద్ధి పనులను ప్రచారం చేసుకునేందుకు సిద్ధం చేసుకున్న కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ఇంటింటి ప్రచారంతో..

నేడోరేపో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు వస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అంతకు ముందే ఒక విడత ప్రచారాన్ని పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. వివిధ రూపాల్లో పార్టీ కార్యక్రమాలు విస్తృతం చేయడంతో పాటు ప్రత్యర్థి పార్టీలను బలహీన పరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి నేటి వరకు నియోజవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను కరపత్రాల రూపంలో ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా అభివృద్ధి పనుల తీరును సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ప్రజలకు వివరించేందుకు ధూం.. ధాం.. కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

మహిళలకు బహుమతులు?

నియోజకవర్గంలో ప్రధాన రహదారులపై ఉన్న ఫంక్షన్‌హాళ్లను ప్రత్యర్థి పార్టీల కార్యక్రమాలకు ఇవ్వకుండా హాళ్ల నిర్వాహకులతో అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వివాహాది శుభకార్యాలు మినహా రాజకీయ సభలు, సమావేశాలకు హాళ్లు అద్దెకు ఇవ్వకుండా ఉండేందుకు రాయల్టీ సైతం చెల్లిస్తున్నట్లు సమాచారం. దసరా పండగకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా చీరలు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈసారి డివిజన్‌కు వెయ్యి మంది చొప్పున మొత్తంగా 5 వేల మంది మహిళలకు వంటకు సంబంధించిన వస్తువులను సైతం బహుమతిగా ఇస్తున్నట్లు నియోజకవర్గ వాసులు చర్చించుకుంటున్నారు.

ఇప్పటి వరకు ఎవరికీ దక్కని హ్యాట్రిక్..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో తొలిసారి టీఆర్ఎస్ అభ్యర్థిగా టీ.పద్మారావుగౌడ్ సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009 ఉప ఎన్నికలో పరాజితులయ్యారు. ఈ రెండు ఎన్నికల్లోనూ తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో తలపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా రెండు వరుస విజయాలు సాధించారు. ఇదిలా ఉండగా ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రెండు వరుస విజయాలు మాత్రమే సాధించిన నాయకులు ఉన్నారు. తొలి ఎన్నిక నుంచి ఇప్పటి వరకు హ్యాట్రిక్ విజయం ఎవరికీ లభించలేదు. రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటిసారి గెలిచి ఆబ్కారీ శాఖ మంత్రిగా, రెండవసారి గెలిచి శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న పద్మారావుగౌడ్ మూడవ విజయం కోసం తనదైన శైలిలో వ్యూహం పన్నుతున్నారు.

బీఆర్ఎస్ నుంచి 7వ సారి..

బీఆర్ఎస్ పార్టీ 'బీ' ఫామ్‌తో ఆరు మార్లు ఎన్నికల్లో పోటీ చేసి ఏడో సారి పోటీకి సిద్ధమవుతున్న ఘనత డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్‌కు దక్కింది. 2002లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మోండా డివిజన్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ విజయం సాధించారు. ఆ తర్వాత 2004, 2008, 2009, 2014, 2018 శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 'బీ' ఫామ్‌తో పోటీ చేసిన పద్మారావుగౌడ్ ఏడవ సారి 2023 ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఖరారు చేసుకున్నారు.

కాంగ్రెస్ అధికారంతోనే రాష్ట్రం అభివృద్ధి



చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా బేగంపేట డివిజన్ పాటిగడ్డలో మంగళవారం స్థానికంగా ఉండే 300 మంది మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి గురించి నిరంతరం ఆలోచించే పార్టీ కాంగ్రెస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ద్వారానే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందన్నారు. మహిళలు బతుకమ్మ పండుగను వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో వారికి చీరలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, కమల్‌రాజ్, మణిమాల, శ్రీనివాస్‌గౌడ్, వెంకటరమణ, యాదమ్మ, లలిత పాల్గొన్నారు.

'గాంధీ' కాంట్రాక్టు నర్సుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె చేస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న ఏఐటీయూసీ ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది న్యాయమైన సమస్యలు, డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, నర్సింహా కోరారు. ఈ ఆస్పత్రి ప్రాంగణంలో బైఠాయించి సమ్మె చేస్తున్న కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందిని మంగళవారం కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా సమయంలో కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించి, వేలాది మందికి పునర్జన్మ ప్రసాదించారని గుర్తు చేశారు. ప్రభుత్వ అధికారుల తప్పుడు విధానాలతో వారికి న్యాయంగా అందాల్సిన వేతనాలపై కోత విధించడంపై తగదని, గత పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకుంటే ఏఐటీయూసీ తరుపున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావును కలిసి చర్చించగా, రాష్ట్ర ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా లేఖ రాసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు నర్సింగ్ యూనియన్ ప్రతినిధులు మేఘమాల, ప్రమీల, ఇందిరా, సబిత, లక్ష్మీ, సుందరమ్మ పాల్గొన్నారు.

భవిష్యత్ అవసరాల దృష్ట్యా అభివృద్ధి పనులు



ఆస్పత్రి భవన నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పద్మారావు గౌడ్

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గంలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా అభివృద్ధి పనులు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. తార్నాక డివిజన్‌లో రూ. 27 కోట్ల నిధులతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ఆయన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో దశలవారీగా పనులు చేపడుతామన్నారు.

◆ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి దళిత బంధు పథకం ద్వారా మంజూరైన ఏడుగురు లబ్ధిదారులకు సివరేజ్ డీ సిల్టింగ్ వాహనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, కంది శైలజ, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, నాయకులు తీగుళ్ల కిషోర్ గౌడ్, రామేశ్వర్, త్రినేత్ర, ఆలకుంట హరి, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, కూరెల్లి నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎస్.రవికిరణ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కార్మికులకు మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్, టీఎక్స్ గ్రూప్ ఆసుపత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్, బీఎంఈస్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. టీఎక్స్ గ్రూప్ ఆసుపత్రి వైద్యనిపుణులు ఛైర్మన్ రాంరెడ్డి, ఈడీ రవీంధర్‌రెడ్డి, వైద్యనిపుణులు కీర్తికారెడ్డి, దీపక్ రాజ్ బృందం మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కృష్ణ, రాధాకృష్ణ, జాన్రి, కొడారి రాజు, ధరమ్‌వీర్ పాల్గొన్నారు.

61 ఏళ్లు కొనసాగించండి

● ఓయూ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను 61 ఏళ్ల వరకు కొనసాగించాలని అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు ఉద్యోగుల నేత చందర్ మంగళవారం తెలిపారు. ఇంటర్‌తో పాటు ఇతర కాంట్రాక్టు ఉద్యోగులను 61 ఏళ్ల వరకు కొనసాగిస్తున్నారని ఓయూలో పని చేసేవారిని కూడా కొనసాగించాలన్నారు. తక్కువ వేతనానికి పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



ఢిల్లీలో సత్తా చాటిన ఎన్‌సీసీ కేడెట్లు



కేడెట్లను అభినందిస్తున్న వీఎం. రెడ్డి

రసూల్‌పురా: ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో ప్రతిభ కనబర్చి నగరానికి వచ్చిన రెండు తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ కేడెట్లను మంగళవారం ఎన్‌సీసీ డిప్యూటీ డైరక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం. రెడ్డి సత్కరించి జ్ఞాపికలను అందజేశారు గత నెల 19 నుంచి 30 వరకు ఢిల్లీ కంటోన్మెంట్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ డైరెక్టరేట్ పరిధిలోని ఎన్‌సీసీ కేడెట్ల ఆల్ ఇండియా థాల్‌సైనిక్ క్యాంప్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో ఆంధ్ర తెలంగాణ డైరెక్టరేట్ కేడెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబరచారని ఎన్‌సీసీ డీడీజే వీఎం.రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో వీఎం. రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆంధ్ర తెలంగాణ డైరెక్టరేట్‌కు చెందిన 51 మంది బాలురు, 40 బాలికల కేడెట్లు మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ సిగ్నల్, జడ్జింగ్ డిస్టెన్స్, టెంట్ పిచింగ్ మొదలైన పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. ఇంటర్ డైరెక్టరేట్ సర్వీస్ షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో మొదటి స్థానం నిలిచారని బాలుర బృందం ద్వితీయ స్థానం, బాలికల బృందం నాలుగోస్థానంలో నిలిచారన్నారు.

హిందూ పబ్లిక్ స్కూల్‌లో 'స్వచ్ఛ పక్వాడా'

సనత్‌నగర్: పుస్తకాలతో కుస్తీ పట్టే ఆ చిట్టి చేతులు పరిశుభ్రతకై నడుం బిగించాయి. తమ పాఠశాల పరిసరాల్లో ఉన్న చెత్తా చెదారాన్ని ఊడ్చి 'స్వచ్ఛ'తకు మారుపేరుగా నిలిచారు. స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు చీపుర్లు పట్టి పాఠశాల ఆవరణతో పాటు పరిసరాలను శుభ్రంగా మార్చారు. అంతకముందు స్వామి వివేకానంద సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి సమాజం పట్ల బాధ్యతను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా వారు భవిష్యత్తులో దేశ సేవలో మరింత చురుకుగా ఉంటారని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రపరుస్తున్న విద్యార్థులు



హెచ్ఎం మల్లికార్జున్‌రెడ్డి బదిలీ..

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని సుప్రసిద్ధమైన మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మల్లికార్జున్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మల్లికార్జున్ రెడ్డి చిలకలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇంకా ఆయన స్థానంలోకి ఎవరూ రాలేదు. మల్లికార్జున్‌రెడ్డి బదిలీ పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అనతి కాలంలోనే పాఠశాలను ఉన్నత పాఠశాల దిశగా తీసుకెళ్లడంతో పాటు మెరుగైన విద్యాబోధనతో విద్యార్థుల జీవితాలను బంగారు బాటలు వేశారని కొనియాడారు. మల్లికార్జున్‌రెడ్డి హయాంలో పాఠశాల అభివృద్ధి చెందడంతో పాటు సుమారు 750 విద్యార్థులకు చదువుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఆయన బదిలీ తీవ్ర బాధాకరమని తల్లిదండ్రులతో పాటు ఉన్నత పాఠశాల సాధన కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

31న ఓయూ స్నాతకోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 83వ స్నాతకోత్సవం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు తెలిపారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థి అడ్వొబి సీఈవో శాంతన్‌నారాయణ్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ సర్టిఫికెట్లకు ఈ నెల 10 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ చూడవచ్చన్నారు.



స్వామి రామానందతీర్థ 120వ జయంతి సందర్భంగా మంగళవారం బేగంపేట బ్రాహ్మణవాడి లోని స్వామి వారి సమాధి వద్ద పీవీ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు, సురభి సోలార్ డైరెక్టర్ శేఖర్ మారంరాజు, స్వామి రామానందతీర్థ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాసుకి నివాళులర్పించారు. –సనత్‌నగర్

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఆంజనేయ గౌడ్, తలసాని సాయికిరణ్

బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర క్రీడాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యచరణతో ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ బి. ఆంజనేయ గౌడ్ అన్నారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదయ్యనగర్ గాస్‌మండి ప్లేగ్రౌండ్స్‌లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను తలసాని సాయికిరణ్ యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల క్రీడా మైదానాలను నిర్మించడమే కాకుండా 23 రకాల క్రీడా పరికరాలతో 18 వేల కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందజేయడం జరిగిందన్నారు. క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న చేయూతను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించడానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదినం సందర్భంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ఈ నెల 6 వరకు నిర్వహిస్తున్నామన్నారు.

16 నుంచి శ్రీవారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి 25 వరకు స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ సీహెచ్. రామయ్య తెలిపారు. అలాగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15 నుంచి 23 వరకు ఆలయంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబా దేవీ అమ్మవారి నవవిధ అలంకారాలతో శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను ఈవో ఎస్. లావణ్యతో కలిసి ఆవిష్కరించారు. 16న శేషవాహన సేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉ.7 గంటలకు శ్రీ మహాగణపతి పూజ, రుద్రాభిషేకం, శ్రీ చక్రార్చన, చండీహోమం జరుగుతాయన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఈఎస్ఐ రోడ్డు పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

సనత్‌నగర్: సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిందే తడవుగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రూ.3.94 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వెల్ఫేర్ సెంటర్ గ్రౌండ్ వద్ద చెట్ల కొమ్మలు పెరిగిపోయి ఇబ్బందికరంగా ఉందని, వెంటనే వాటిని తొలగించాలని మంత్రిని కోరారు. వెంటనే కొమ్మల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులను ఆయన ఆదేశించారు. ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ పార్కు సమీపంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరగా, సమస్య పరిష్కారానికి రూ.55 లక్షలను విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే పార్కులో లైట్లు సరిగా వెలగడం లేదని ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే లైట్లను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీ–టైపు కాలనీలో ఈఎస్ఐ, బీఎస్ఎన్ఎల్ శాఖలకు చెందిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈఎస్ఐ అధికారి రవికుమార్, వివిధ శాఖలకు చెందిన అధికారులతో కలిసి ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డును పరిశీలించారు. విస్తరణలో భాగంగా అడ్డంకిగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాల్సి ఉందన్నారు. రోడ్డు విస్తరణ పనులను చేపట్టడం కోసం త్వరలోనే వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించాలన్నారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీఎంసీ జగన్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం ప్రభు, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ అమర్నాథ్, ఏఎంఓహెచ్ భార్గవ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఫహీం, నాయకులు బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సరాఫ్ సంతోష్, సురేష్‌గౌడ్, రాజేష్‌ముదిరాజ్, పుష్పలత పాల్గొన్నారు.

దళితులు అభ్యున్నతికే దళితబంధు..

సనత్‌నగర్: దళితుల అభ్యున్నతికే దళితబంధు పథకం అమలు చేస్తున్నారని మంత్రి అన్నారు. బన్సీలాల్‌పేటకు చెందిన ఆరుగురు లబ్ధిదారులకు దళితబంధు పథకం కింద మంజూరైన పూడికతీత వాహనాలను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. దళితులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయడమే కాకుండా వాటిని సద్వినియోగం చేసుకునే అవకాశాలను కూడా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఒక్కో వాహనాన్ని రూ.9.40 లక్షల వ్యయంతో కొనుగోలు చేయడం జరిగిందని ఈ వాహనాలను మెట్రో వాటర్‌వర్క్స్‌కు అద్దెకు ఇవ్వడం వల్ల ప్రతినెలా లబ్ధిదారులకు ఆదాయం లభిస్తుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 162 మందికి ఈ వాహనాలను అందజేసినట్లు మంత్రి చెప్పా రు. పవన్‌కుమార్‌గౌడ్, వెంకటేష్,, రాజు, గజ్జెల శ్రీనివాస్, శివకుమార్, సురేష్, వినోద్, మహేష్ పాల్గొన్నారు.